

రైలురోకోకు మద్దతు ఇవ్వాలని వామపక్ష నేతలను కోరుతున్న ఎమ్మెల్సీ కవిత

కలిసొచ్చే శక్తులతో బీసీ ఉద్యమం ఉధృతం

- వామపక్ష పార్టీలు కలిసి రావాలి
- 50 సార్లు ఢిల్లీకి వెళ్లినా ప్రధానితో బీసీ బిల్లుపై చర్చించని రేవంత్
- ఆమోదముద్ర కోసమే ఉద్యమం : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- వామపక్ష పార్టీ నేతలతో భేటీ
- రైల్‌రోకోకు మద్దతివ్వాలని పిలుపు

హైదరాబాద్, జూన్ 24 (నమస్తేతెలంగాణ)/చిక్కడపల్లి: 'బీసీ బిల్లు ఆమోదానికి ఎంత ఆలస్యమైతే బీసీలకు అంత అన్యాయం జరుగుతుంది.. తమతో కలిసొచ్చే భావసారూప్యత ఉన్న పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.. ఐక్య ఉద్యమాలకు కలిసి రావాలి' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జూలై 17న నిర్వహించనున్న రైల్‌రోకోకు మద్దతును ఇవ్వాలని మంగళవారం ఆమె వామపక్ష పార్టీల నేతలను కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యాలయమైన ఎంబీ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో, అడిక్‌మెట్‌లోని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యాలయమైన మార్క్స్ భవన్‌లో ఆ పార్టీ కేంద్రకమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు, జేవీ చలపతిరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే గోవర్ధన్‌తో కవిత వేర్వేరుగా భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్ల పెంపు, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు కోసం తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో ఏడాదిగా అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించామని వారికి కవిత వివరించారు. తమతోపాటు బీసీ సంఘాలు చేసిన ఆందోళనలకు దిగివచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ, కౌన్సిల్‌లో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఒక బిల్లు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపునకు మరో బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసిందని తెలిపారు. ఈ బిల్లులను కేంద్రానికి పంపి మూడు నెలలవుతున్నా, ఆమోదం కోసం కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి ఒత్తిడి చేయడం లేదని విమర్శించారు. అందుకే జూలై 17న రైల్‌రోకో కార్యక్రమానికి పిలుపునిచ్చామని, దీనికి మద్దతు ఇవ్వాల్సిందిగా కవిత కోరారు. ఢిల్లీకి వెళ్లిరావడంలో హాఫ్ సెంచరీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీతో ఒక్కసారి కూడా బీసీ బిల్లుల ఆమోదం కోసం ఒత్తిడి తేలేదని ధ్వజమెత్తారు. కేంద్రం బీసీ బిల్లుకు ఆమోదముద్ర వేయాలంటే ఉద్యమబాట ఒక్కటే మార్గమని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, యూపీఎఫ్ కో-ఆర్డినేటర్ ఆల కుంట హరి, తెలంగాణ జాగృతి, యూపీఎఫ్, సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు పాల్గొన్నారు.

కవిత బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు : జాన్‌వెస్లీ

బీసీల కోసం ఎమ్మెల్సీ కవిత చేపట్టిన ఉద్యమాలకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ వెల్లడించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం న్యాయమైన డిమాండ్ అని స్పష్టం చేశారు. సామాజిక న్యాయం కోసం కవిత చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడిని పెంచేందుకు ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాల్సిన బాధ్యత సీఎంపై ఉన్నదని చెప్పారు.

కవితపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు: బొల్ల శివశంకర్

తమ పదువులను కాపాడుకునేందుకు కాంగ్రెస్‌లోని కొందరు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని యూపీఎఫ్ కన్వీనర్ బొల్ల శివశంకర్ హితవు పలికారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం చిత్తశుద్ధితో ఉద్యమిస్తున్న కవితపై ఆరోపణలు చేయడం కాదు.. పెంచిన రిజర్వేషన్లను అమలు చేయడానికి బాధ్యత తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు.

టెండర్ 14 లక్షలు.. వ్యయం 75 లక్షలు!

నీటి సంపు నిర్మాణంలో అక్రమాలు • చర్లపల్లి 'ఐలా'లో అధికారుల ఇష్టారాజ్యం

హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా)లలో పాలన అదుపు తప్పుతున్నది. పన్నుల ద్వారా వసూలవుతున్న సొమ్మును జవాబుదారీతనం లేకుండా స్థానిక అధికారులు ఇష్టారాజ్యాంగా దుర్వినియోగం చేస్తున్నట్టు తరచూ ఆరోపణలొస్తున్నాయి. తాజాగా చర్లపల్లి పారిశ్రామిక వాడలో ఇలాంటి ఘటనే ఒకటి వెలుగుచూసింది. అక్కడి అధికారులు చేపట్టిన నీటి సంపు నిర్మాణ వ్యవహారం తీవ్ర వివాదాస్పదమైంది. సంపు నిర్మాణానికి రూ. 14 లక్షలకు టెండరు ఖరారు కాగా, పనులు చేపట్టాక వ్యయాన్ని రూ. 75లక్షలకు పెంచడమే వివాదానికి ప్రధాన కారణం. వ్యయం పెంపును ఐలా మేనేజింగ్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. పనుల్లో అవకతవకలు జరిగినట్టు టీజీఐఐసీకి పలువురు ఫిర్యాదు చేశారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని పరిశ్రమల అవసరాల కోసం 3 లక్షల లీటర్ల సామర్థ్యంతో నీటి సంపు నిర్మాణానికి గత నెలలో టెండర్లు ఖరారు చేశారు. రూ. 24 లక్షల అంచనాతో టెండర్లు పిలవగా, అతి తక్కువగా రూ. 14 లక్షలు కోట్ చేసిన ఏజెన్సీకి పనులు అప్పగించారు. అయితే పనులు ప్రారంభమైన కొన్ని రోజులకే అంచనా వ్యయాన్ని రూ. 75 లక్షలకు పెంచారు. ఈ మేరకు టీజీఐఐసీ ఎండీ నుంచి స్థానిక ఐలా కమిషనర్ అనుమతి పొందారు.

కాంట్రాక్టర్, కమిషనర్ కుమ్మక్కు!

ఇటీవల నిర్వహించిన ఐలా నిర్వహణ కమిటీ సమావేశంలో అంచనా వ్యయం పెంపు ప్రతిపాదనను ప్రవేశపెట్టగా, కమిటీ తిరస్కరించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా టెండరు ధరకు నాలుగైదు శాతం వరకు వ్యయం పెంచుకోవచ్చు. కానీ, ఏకంగా ఐదారు రెట్ల వ్యయాన్ని పెంచడం ఏమిటని కమిషనర్‌ను నిలదీశారు. కాంట్రాక్టరు, కమిషనర్ కుమ్మక్కై ఐలా నిధులను దండుకునేందుకు సంపు నిర్మాణ వ్యయాన్ని అడ్డగోలుగా పెంచారని మేనేజింగ్ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. అనుమతి కోసం టీజీఐఐసీ యాజమాన్యాన్ని కూడా వారు తప్పుదోవ పట్టించారని విమర్శిస్తున్నారు. టెండర్లలో కోట్ చేసిన రూ. 14 లక్షలకే పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు. దీనిపై కమిషనర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు. దీనిపై పలువురు సామాజిక కార్యకర్తలతోపాటు స్థానిక పరిశ్రమల నిర్వాహకులు టీజీఐఐసీ ఎండీకి ఫిర్యాదుచేశారు. ఐలా నిధులు పక్కదారి పట్టకుండా అడ్డుకోవాలని, విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌పై తర్జనభర్జన

- ఫీజుల పెంపులేదని ఉత్తర్వులు ఇవ్వని కాంగ్రెస్ సర్కారు..!
- సర్కారు స్పష్టత ఇవ్వకపోవడంతో ముందుకెళ్లలేకపోతున్న అధికారులు
- కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలకు బ్రేక్

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇంజినీరింగ్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలకు బ్రేకులు పడ్డాయి. మంగళవారమే విడుదల కావాల్సిన షెడ్యూల్ నిలిచిపోయింది. ఒకే ఒక్క కారణంతో నిలిపివేసినట్టు సమాచారం. ఎప్‌సెట్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేసేందుకు అధికారులు అంతా సిద్ధంచేశారు. ఈ నెలాఖరు లేదా, జూలై 1 నుంచి కౌన్సెలింగ్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ తరుణంలో చిన్న చిక్కొచ్చిపడింది. ఆ చిక్కుపై అధికారులు ప్రభుత్వం నుంచి స్పష్టత కోరారు. ప్రభుత్వం సరైన స్పష్టతను ఇవ్వకపోవడంతో కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల నిలిచిపోయింది. రాష్ట్రంలో బీటెక్ సహా ప్రొఫెషనల్ కోర్సుల కన్వీనర్ కోటా ఫీజుల సవరణకు తెలంగాణ అడ్మిషన్-ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) ఇప్పటికే కసరత్తును పూర్తిచేసింది. ఆ కమిటీ కాలేజీల వారీగా ఫీజులను ఖరారు చేసింది. ఆ ఫీజులను ఆమోదించాల్సిన తరుణంలో ప్రభుత్వం వివిధ కాలేజీల్లో ఫీజులు అసాధారణంగా పెరగడంపై అభ్యంతరాలను వ్యక్తంచేసింది. ఇటీవలే జరిగిన టీఏఎఫ్ఆర్సీ సమావేశంలో ఫీజుల పెంపులేదని, పాత ఫీజులతోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అధికారులు ఎప్‌సెట్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సిద్ధంచేశారు.

ప్రభుత్వం నుంచి స్పష్టత కరువు

కౌన్సెలింగ్ షెడ్యూల్‌కు ముందు అధికారులకు ఓ అనుమానం తట్టింది. ఫీజుల పెంపులేదని టీఏఎఫ్ఆర్సీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కానీ ఇదే విషయంపై సర్కారు నుంచి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు విడుదల కాలేదు. ఇలా ఉత్తర్వులు లేకుండా ముందుకెళ్తే కాలేజీలు కోర్టుకెళ్తాయని, న్యాయపరమైన చిక్కులు తప్పవన్న అభిప్రాయం వారిఓ వ్యక్తమైంది. ఈ మేరకు ఈ ఏడాదికి పాత ఫీజులే ఉంటాయని ఉత్తర్వులు ఇవ్వాలని సర్కారును అభ్యర్థించారు. అయితే సర్కారు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో షెడ్యూల్ విడుదల వాయిదా పడింది.

మిగతా కోర్సులకూ పాత ఫీజులే

బీటెక్‌తోపాటు అన్నిరకాల ప్రొఫెషనల్ కోర్సులకు ఈ ఏడాది పాత ఫీజులను కొనసాగించాలని సర్కారు నిర్ణయించింది. రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్, ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ, ఫార్మా-డీ, ఆర్కిటెక్చర్, ఫైన్‌ఆర్ట్స్, బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, యూజీ డీపీఈడీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం వంటి కోర్సుల ఫీజుల సవరణకు కూడా టీఏఎఫ్ఆర్సీ కసరత్తు చేసింది. ఈసారి ఫీజుల పెంపు లేదన్న నిర్ణయం బీటెక్‌తోపాటు అన్ని కోర్సులకూ వర్తిస్తుందని స్పష్టతనిచ్చింది. దీంతో పాత ఫీజుల ప్రకారమే ఆయా కోర్సుల్లోని సీట్లను భర్తీచేస్తారు.

తిరుగు బదిలీల్లో ఆప్షన్ ఇవ్వాలి

మంత్రి సీతక్కకు ఎంపీడీవోల వినతి

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): తిరుగు బదిలీల్లో తమకు ఆప్షన్స్ ఇవ్వాలని, 317జీవోను వర్తింపజేయవద్దని ఎంపీడీవోలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కకు ఆ సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎంపీడీవోలను సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారని, వారందరికీ ఎలాంటి ఆంక్షలు విధించకుండా యథా స్థానాలకు బదిలీ చేయాలని కోరారు. తహసీల్దార్ల తిరుగు బదిలీల్లో అనుసరించినట్టుగానే ఎంపీడీవోలకు ఆప్షన్స్ ఇస్తామమని సీతక్క వారికి హామీ ఇచ్చారు.

పురపాలకశాఖలో భారీగా బదిలీలు

- 129 మంది మున్సిపల్ కమిషనర్లకు స్థానచలనం
- పురపాలకశాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పెద్ద సంఖ్యలో అధికారులను బదిలీ చేసింది. ఇటీవలే ఐఏఎస్, ఐపీఎస్‌లకు స్థానచలనం కల్పించిన సర్కారు.. ఇప్పుడు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేసింది. గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 కమిషనర్లకు పదోన్నతులు ఇవ్వడంతోపాటు స్థానచలనం కల్పించింది. ఒకేసారి 129 మంది మున్సిపల్ కమిషనర్లను వివిధ జిల్లాలు, జీహెచ్ఎంసీకి బదిలీచేస్తూ పురపాలకశాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు.

పదోన్నతులు, బదిలీలు వీరికే..

జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లు అరుణకుమారి, యాదయ్య, మోహన్ రెడ్డి, రవికుమార్‌కు పదోన్నతి కల్పించారు. మరో డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్‌ను మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీచేశారు. అమరచింత మున్సిపల్ కమిషనర్ రవిబాబును నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు డిప్యూటీ కమిషనర్‌గా స్థానచలనం కల్పించారు. సచివాలయంలో అసిస్టెంట్ సెక్రటరీలు మధుకిరణ్, మల్లికార్జున్‌రావు, యాదయ్యను జీహెచ్ఎంసీకి బదిలీ చేశారు. వివిధ హోదాల్లో ఉన్నవారికి పదోన్నతులు కల్పిస్తూ బదిలీలు చేశారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

ఎన్‌వోసీ ఇవ్వడానికి రూ.15 వేలు డిమాండ్

దస్తురాబాద్, జూన్ 24: నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం గొడిసెర్యాల పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ రూ.12వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ మధు వివరాల ప్రకారం.. గొడిసెర్యాలకు చెందిన ఓ వ్యక్తి వాటర్ ప్లాంటు, షెడ్డు నిర్మించుకున్నాడు. కరెంటు మీటరుకు దరఖాస్తు చేసుకున్నాడు. మూడు నెలల క్రితం ఎన్‌వోసీ కావాలని పంచాయతీ కార్యదర్శి శివకృష్ణకు అర్జీ పెట్టుకున్నాడు. ఎన్‌వోసీ ఇవ్వడానికి కార్యదర్శి రూ.15 వేలు డిమాండ్ చేయగా.. రూ.12 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి శివకృష్ణకు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శివకృష్ణను ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

నేటి నుంచి మెడికల్ కాలేజీల్లో తనిఖీలు

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): మెడికల్ కాలేజీల్లో బుధవారం నుంచి 29 వరకు కలెక్టర్లు, వైద్యారోగ్య శాఖ హెచ్‌వోడీలు తనిఖీలు చేపట్టనున్నారు. మెడికల్ కాలేజీల్లో మౌలిక వసతుల లేమి, సహా పలు సమస్యలపై ఇటీవల జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) నోటీసులు జారీ చేసింది. దీంతో మెడికల్ కాలేజీల్లో కలెక్టర్లతోపాటు వైద్యారోగ్య శాఖ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ, డీహెచ్ రవీంద్ర నాయక్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేంద్ర కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్రరెడ్డి, అకాడమిక్ డీఎంఈ శివ్‌రామ్ ప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు ఈ తనిఖీల్లో పాల్గొననున్నారు. 29 వరకు తనిఖీలు కొనసాగనున్నాయి. వైద్య కాలేజీల్లో గుర్తించిన సమస్యలపై ఉన్నతాధికారులు, కలెక్టర్లు ఈ నెల 30న ప్రభుత్వానికి నివేదికలు అందజేయనున్నారు.

ఇరిగేషన్ శాఖ జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్

హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ జాయింట్ సెక్రటరీ(టెక్నికల్)గా డిప్యూటీ ఈఎన్సీ శ్రీనివాస్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ సెక్రటరీ భీమ్ ప్రసాద్ ఆరు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. నాటి నుంచి పోస్టు ఖాళీగా ఉండగా, ఆయన స్థానంలో ప్రస్తుతం శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. శ్రీనివాస్ ప్రస్తుతం ఈఎన్సీ జనరల్ వద్ద డిప్యూటీ ఈఎన్సీగా కొనసాగుతున్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్న ఇంజినీర్ల స్థానంలో పలువురికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. కరీంనగర్ ఈఎన్సీ శంకర్ విరమణ పొందనుండగా, ఆయన స్థానంలో నిజామాబాద్ సీఈ మధుసూదన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. అలాగే మరో 13మంది విరమణ పొందనుండగా వారి బాధ్యతలను ఇతరులకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

16 ఏండ్ల వయస్సులో ప్రేమ..

అడ్డొస్తున్నదని తల్లి హత్య

ఇన్‌స్టాలో యువకుడితో పరిచయం.. ఆపై ప్రేమ	ఇటీవల బాలికను ఇంట్లోంచి తీసుకెళ్లిన యువకుడు
	బిడ్డ కనిపించడం లేదని పోలీసులకు తల్లి ఫిర్యాదు
	పంచాయితీ పెట్టి యువకుడిని వదిలేసిన పోలీసులు
ప్రియుడు, అతడి సోదరుడితో కలిసి ఘాతుకం	తల్లి అడ్డుతొలగించేందుకు ప్రియుడితో కలిసి స్కెచ్
	స్పృహతప్పిన తల్లి తలపై సుత్తితో కొట్టిన కూతురు
	చిన్నబిడ్డ ఎదుటే దారుణం.. ఎన్ఎల్‌బీ నగర్‌లో ఘటన
	మృతురాలు చాకలి ఐలమ్మ ముని మనుమరాలు

మృతురాలు అంజలి (ఫైల్), పగిళ్ల శివతో బాలిక

హైదరాబాద్ సిటీబ్యూరో/ జీడిమెట్ల, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఇటీవల ప్రియుడి కోసం భర్తలను చంపిన దారుణాలు ఇంకా జనాల మెదళ్లలో మెదులుతుండగానే.. ఓ బాలిక తన ప్రేమకు అడ్డు పడుతున్నదని ఏకంగా తల్లినే హతమార్చింది. ప్రియుడు, అతడి సోదరుడితో కలిసి ఈ దారుణానికి ఒడిగట్టింది. మంటగలుస్తున్న మానవ సంబంధాలకు ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధి గాజులరామారం, ఎన్ఎల్‌బీ నగర్‌లో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఉదంతం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన అంజలి (39) జనగామ జిల్లా పాలకుర్తికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ముని మనుమరాలు. ఆమె జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారం, ఎన్ఎల్‌బీ నగర్‌లో నివాసముంటూ తెలంగాణ సాంస్కృతిక విభాగంలో కళాకారిణిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నది. ఆమెకు రెండు పెండ్లిళ్లు కాగా ఇద్దరు భర్తలూ చనిపోయారు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు. ఒకరు పదో తరగతి చదువుతుండగా మరో కూతురు 8వ తరగతి చదువుతున్నది. ఈ క్రమంలో పదో తరగతి చదువుతున్న కూతురికి 8 నెలల క్రితం బంధువైన నల్లగొండ జిల్లా కట్టంగూరుకు చెందిన పగిళ్ల శివ (19)తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైంది. అదికాస్తా ప్రేమగా మారింది. ఈ నెల 19న శివ బాలికను కట్టంగూర్‌కు తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న తల్లి అంజలి జీడిమెట్ల పోలీసులకు శివపై ఫిర్యాదు చేసింది. పోలీసులు బాలికను, శివను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలికపై శివ లైంగిక దాడికి పాల్పడ్డాడని, అతడిపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని తల్లి పోలీసులను కోరింది. అయితే పోలీసులు 'పదో తరగతిలో ప్రేమా.. గీమా ఏంటమ్మా?' అని మందలించి పంపారు. దీంతో తల్లికూడా మందలించడంతో తన ప్రేమకు తల్లే అడ్డు పడుతున్నదని బాలిక కోపం పెంచుకున్నది. ప్రియుడు శివతో కలిసి తల్లిని అడ్డు తొలగించుకోవాలని ప్లాన్ చేసింది. సోమవారం సాయంత్రం కట్టంగూర్ నుంచి శివ, అతడి మైనర్ సోదరుడు కలిసి గాజులరామారం వచ్చారు. అంజలి సోమవారం ఇంట్లో పూజ చేస్తుండగా వెనుక నుంచి ఆమె ముఖంపై బెడ్‌షీట్ కప్పి, ఆ తర్వాత చున్నీతో గొంతు నులిమారు. ఆ తర్వాత శివ, అతడి సోదరుడు కలిసి ఆమె తలపై బలమైన ఆయుధంతో కొట్టారు. తల్లి తలపై కూతురు సుత్తితో కొట్టింది. శివ సోదరుడు కత్తితో గొంతు కోసి దారుణానికి ఒడిగట్టారు.

అక్క నన్ను గల్లీలో ఆపింది : బాలిక చెల్లి

'ట్యూషన్ నుంచి వస్తున్న నన్ను మా అక్క గల్లీలోనే ఆపింది. అమ్మ ఒక ఆంటీని తీసుకు రమ్మన్నది పద వెళ్దామని చెప్పి గల్లీలోనే తిప్పింది. 20 నిమిషాల తర్వాత అక్క, నేను ఇంటికి వెళ్లేసరికి వంటగదిలో మా అమ్మ స్పృహ లేకుండా పడి ఉంది. అమ్మను నేను చూసుకుంటా, నువ్వు బయటకు వెళ్లి మీ ఫ్రెండ్స్‌ను ఎవరినైనా తీసుకురా.. గల్లీలో అంటీ వాళ్లకు ఎవరికీ చెప్పకు అన్నది. కానీ మా అమ్మ చనిపోలేదని తెలిసి మా అక్క శివకు మళ్లీ కాల్ చేసింది. ఇంకా చనిపోలేదు.. కాళ్లు, చేతులు అడిస్తున్నదని ఫోన్‌లో చెప్పింది. వెంటనే శివ, అతడి తమ్ముడు వచ్చి సుత్తితో అమ్మ తలపై కొట్టిండ్రు. రక్తంలో పడి ఉన్న అమ్మ వద్దకు వెళ్లి చేతులు, కాళ్లు రుద్దిన. మా అక్క మాత్రం దగ్గరికి రాకుండా దూరంగా ఉండి ఆమె చనిపోయింది.. లేపి వెస్ట్ అని చెప్పింది' అని వెక్కివెక్కి ఏడ్చింది.

పోలీసుల నిర్లక్ష్యం వల్లే జరిగింది : మృతురాలి బంధువులు

'మా చెల్లి అంజలి అందరితో మంచిగా ఉంటది. ఆమెకు ఇద్దరు ఆడబిడ్డలు. పెద్ద బిడ్డకు ప్రేమ పేరుతో శివ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైండు. చదువుకునే వయస్సులో ప్రేమ ఏందని అన్నందుకు తల్లిపై బిడ్డ కోపం పెంచుకున్నది. ఐదు రోజుల క్రితం ఇంట్లో నుంచి శివతో కలిసి పారిపోయింది. మేం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టినం. పోలీసులు ఇద్దరినీ పట్టుకొచ్చి మందలించి వదిలేసిండ్రు. శివపై కేసు పెట్టి స్టేషన్‌లో ఉంచాలని పోలీసులను కోరినా వినలేదు. పోలీసులు పట్టించుకోకపోవడం వల్లే ఇంత దారుణం జరిగింది' అంటూ మృతురాలి బంధువులు ఆవేదన వ్యక్తంచేశారు.

చర్యలు తీసుకుంటే ఇలా జరిగేది కాదు: స్థానికులు

మైనర్‌ను తీసికెళ్లిన శివపై జీడిమెట్ల పోలీసులు కేసు పెట్టుకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ దారుణం జరిగిందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. నిందితుడిపై పోక్సో కేసు పెట్టి అరెస్ట్ చేయాల్సిన పోలీసులు కేసు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఘటనా స్థలాన్ని బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ పరిశీలించారు. బాలికతో పాటు శివ, అతడి సోదరుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

బిల్లులు రాక..

మాజీ సర్పంచ్ ఆత్మహత్య

- ఆస్తులు అమ్ముకున్నా తీరని అప్పులు
- పురుగుమందు తాగి బలవన్మరణం
- జగిత్యాల జిల్లా బీబీరాజ్‌పల్లి గ్రామంలో విషాదం
- సర్కారే బాధ్యతవహించాలి : తాజా మాజీ సర్పంచ్‌లు

శంకరయ్య (ఫైల్)

గొల్లపెల్లి, జూన్ 24 : గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి బిల్లులు రాక ఓ మాజీ సర్పంచ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక.. అప్పులు తీర్చే దారి లేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం బీబీరాజ్‌పల్లిలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీరాజ్‌పల్లికి చెందిన దాసరి శంకరయ్య(50) అప్పు చేసి రూ.10 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించాడు. ఇందుకు సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు రాలేదు. దీంతో తెచ్చిన అప్పులు పెరిగాయి. ఇదే సమయంలో కొడుకును విదేశాలకు పంపే ప్రయత్నంలో విఫలమై మరి కొంత అప్పుల్లోకి కూరుకుపోయాడు. ఇందుకోసం తన మామిడి తోటను కూడా అమ్ముకున్నాడు. అయినప్పటికీ అప్పులు తీరలేదు. అప్పుల బాధ ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన సోమవారం గ్రామంలోని ఓ మామిడితోటలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జగిత్యాల దవాఖానకు తరలించారు.

శంకరయ్య కుటుంబానికి కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

జగిత్యాల, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : మాజీ సర్పంచ్ శంకరయ్య ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహా రెడ్డి డిమాండ్ చేశారు. అప్పుచేసి అభివృద్ధి పనులు చేపట్టిన శంకరయ్యకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాక, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక.. ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. ఆయన కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లుల విడుదల కో